

keratam.in www.digital.keratam.in

కెరటం

డిజిటల్ విప్లవం

గురువారం, 24 నవంబర్ 2022 పేజీలు : 08

## ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావుకు

# కన్నీటి వీడ్కోలు



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

గుత్తికోయల చేతిలో హత్యకు గురైన ఫారెస్ట్ రేంజర్ చలమల శ్రీనివాసరావుకు బుధవారం ఈర్లపూడిలో కన్నీటి వీడ్కోలు పలికారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు అటవీ ప్రాంతంలో ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావును గొత్తి కోయలు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలన కలిగించింది. కాగా బుధవారం రేంజర్ స్వగ్రామం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వర రావు, రాష్ట్రంలోని పలువురు ఉన్నతాధికారులు హజరయ్యారు. శ్రీనివాసరావు పాడెమోసిన మంత్రులు అల్లోల, పువ్వాడ కుటుంబానికి, ప్రభుత్వ అధికారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళులర్పించి అతడి అంతిమయాత్రలో పాల్గొన్న వారిలో హరితహారం ఓఎస్‌డీ ప్రియాంకా వర్గీస్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతకుమారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ఎం డోబ్రియల్, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, అనుదీప్, ఐటీడీఏ పీవో గౌతమ్ పొట్రు, భద్రాద్రి ఎస్పీ వినీత్, ఖమ్మం ఏడీసీపీ డాక్టర్ శబరీశ్, తదితరులు పాల్గొన్నారు.

**పూర్తి వివరాలు 2వ పేజీలో...**



### ఎఫ్ఆర్వో కుటుంబానికి ఎంపీ వద్దిరాజు

## రూ.2 లక్షల ఆర్థిక సాయం



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు కుటుంబానికి రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బాసటగా నిలిచారు. కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా రూ.2 ఆర్థిక సాయం అందించి పెద్ద మనసు చాటుకున్నారు. ఈర్లపుడి లో జరిగే ఎఫ్ఆర్వో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మంత్రులతో కలిసి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా రవిచంద్ర ఖమ్మం చేరుకున్నారు. ఈర్లపుడిలోని శ్రీనివాసరావు ఇంటికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి అందించే సాయంతో పాటు వ్యక్తిగతంగా తాను కూడా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఎంపీ బావించారు. దీంతో రూ. 2 లక్షల రూపాయలను మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, ఇంద్రకరణ్ రెడ్డి ల చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు ఇప్పించారు. ప్రభుత్వ సాయానికి తోడు వ్యక్తిగతంగా ఆదుకున్న ఎంపీ రవిచంద్ర ను మంత్రులు అభినందించారు. అనంతరం ఆయన మంత్రులతో కలిసి శ్రీనివాసరావు పాడె మోసి అంతిమ వీడ్కోలు పలికారు.

### శ్రీనివాసరావును హత్యచేసిన వారిని

## కఠినంగా శిక్షిస్తాం..

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

అడవులను రక్షించే అధికారులకు ఆయుధాలను అందించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, అడవులకు రక్షణ కవచంగా ఉండే అటవీ ఉద్యోగులపై జరిగే దాడులను ఇక ఏమాత్రమూ సహించబోమని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉండి గొత్తి కోయల దాడిలో మరణించిన ఫారెస్ట్ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు అంత్యక్రియల్లో పాల్గొందుకు వచ్చిన ఆయన.. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి మృతుడి గ్రామమైన ఖమ్మం జిల్లా ఈర్లపూడిలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన గొత్తి కోయల్లో కొందరు ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రేంజ్ అధికారిని హత్య చేయాల్సిన అవసరం వారికి ఏమొచ్చిందో వారిని ఎవరు ప్రేరేపిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. పోడు భూముల అంశంపై ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, సమగ్ర సర్వే అనంతరం అర్హులందరికీ హక్కు పత్రాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించిందని అన్నారు. ఇదే సమయంలోనే మరోవైపు ఈ తరహా చర్యలకు పాల్పడడం దారుణమని అన్నారు. శ్రీనివాసరావు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు ఆయన కుటుంబం కోరుకున్న చోట 500 గజాల ఇంటి స్థలం, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం తక్షణమే ఇస్తామని అన్నారు.

### క్షణకాలంలోనే

### వీడియో తీస్తున్నందుకు కత్తులతో దాడికి దిగిన గుత్తికోయలు

# వేటకత్తులతో దాడి

ఖమ్మం, భద్రాద్రి జిల్లా ప్రతినిధులు, కెరటం న్యూస్

స్థానికంగా అందుతున్న వివరాల ప్రకారం ఫారెస్టు రేంజర్ శ్రీనివాసరావు, ఆయనతో పాటు సెక్షన్ ఆఫీసర్ రామారావు ఇరువురూ ఎర్రబోడు అటవీ ప్రదేశానికి వెళ్లారు. తొలుత గుత్తికోయలతో మాట్లాడుతూ చెట్లు నరకవద్దనీ, పశువులతో ప్లాంటేషన్‌ను మేపవద్దని మాట్లాడుతున్న క్రమంలో ఎఫ్ఆర్ఓ సహచర ఉద్యోగి వీడియో తీస్తున్న క్రమంలో గుత్తికోయల్లో కోపం కట్టలు తెంచుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే తొలుత రామారావును వీడియో తీయవద్దని హెచ్చరించిన పిదప స్వల్పంగా వాదన జరిగినట్టు తెలుస్తోంది. దీంతో రామారావుకు మద్దతుగా శ్రీనివాసరావు మాట్లాడటంతో ఒక్కసారిగా ఆయనపై పదునైన ఆయుధాలతో దాడికి దిగారు. ఈ ఘటనకు సంబంధించి భద్రాద్రి జిల్లా ఎస్పీ వినీత్ తెలిపిన వివరాల ప్రకారం...హత్య ఎలా జరిగింది. ఎంతమంది దాడి చేశారనే దానిపై ఎస్పీ వివరించారు. కేవలం ఇద్దరు మాత్రమే ఫారెస్ట్ రేంజర్ పై దాడికి పాల్పడ్డారని జిల్లా ఎస్పీ వినీత్ తెలిపారు. వారు అక్కడ ప్లాంటేషన్‌లో పశవులను మేపుతుండగా ఇక్కడ వద్దని వారించారు. ఆదృశ్యాలను రేంజర్ వెంట వచ్చిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తేజావత్ రామారావు తన సెల్ ఫోన్ లో చిత్రీకరించారు. దాన్ని గొత్తి కోయలు తప్పు బట్టారు. దీంతో దాడికి పాల్పడ్డారు. దాడిలో మడకం తులా, పోడియం నంగా పాల్గొన్నారు. వారు ఇద్దరు కలిసి ఫారెస్ట్ రేంజర్ పై తమ దగ్గర ఉన్న వేట కొడవళ్ళతో విచక్షణ రహితంగా నరకడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న శ్రీనివాస్‌రావును మొదట చంద్రుకొండ పి హెచ్ సి కి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని కిమ్స్ కు తరలించారు. అయనప్పటికీ ఆయన ప్రాణాలు కాపాడలేక పోయారు. దాడికి పాల్పడ్డ తులా, నంగాలు ఆ రాత్రి ఫారెస్ట్ లోనే పడుకొని మరసటి రోజు ఛత్తీస్ ఘడ్ లోని వారి గ్రామాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా బుధవారం ఎర్రబోడు సమీపంలోని సీతారామ కాలువ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. గుత్తి కోయల కదిలికలపై జాగ్రత్తగా ఉంటున్న ఫారెస్ట్ అధికారులు ఎందుకో ఆరోజు సరైన జాగ్రత్తలు తీసుకోలేదని అభిప్రాయాలు ఉన్నాయి. ప్లాంటేషన్ లో పశువులను మేపుతున్నట్లు సమాచారం తో అక్కడకు వెళ్లిన రేంజర్ కేవలం ఒక సెక్షన్ ఆఫీసర్‌ను వెంట బెట్టుకొని పోవడం వల్లనే ఇది జరిగిందనే అభిప్రాయాలు ఉన్నాయి. పోడు భూముల్లో ప్లాంటేషన్ చేయడం ఇష్టం లేని గొత్తి కోయలు, అధికారులపై తరుచు గొడవపడుతుంటారని ఫారెస్ట్ ఉద్యోగులు అంటున్నారు. అంతకు కొద్దీ రోజుల ముందు కూడా ప్లాంటేషన్‌ను వారు అడ్డుకున్నారని అంటున్నారు. ఇది పోలీసుల లాఠీచార్జి వరకు వెళ్ళింది. చివరకు రేంజర్ హత్యకు దారితీయడంపై ఫారెస్ట్ వణికి పోతుంది. తమకు ఆయుధాలు ఇవ్వకుండా ఉద్యోగాలు చేయబోమని ఫారెస్ట్ సిబ్బంది హాజరైన మంత్రులకు స్పష్టం చేశారు.





# ఎఫ్ఆర్వోకు
# కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంచనాలతో రేంజర్ శ్రీనివాసరావు అంత్యక్రియలు
- అంత్యక్రియలకు హాజరైన మంత్రులు అల్లోల, పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు రేగా, మెచ్చా
- పాడె మోసిన మంత్రులు..
- దు:ఖ స్వరంతో కుటుంబ సభ్యులను ఓదార్చిన నాయకులు
- శోకసంద్రమైన 'ఈర్లపూడి'
- ఫారెస్ట్ రేజంర్ నివాసరావుకు కన్నీటి వీడ్కోలు
- కడసారి చూపుకోసం తరలివచ్చిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు
- దహన సంస్కారాలు నిర్వహించిన ఎఫ్ఆర్వో కుమారుడు యశ్వంత్

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్



గుత్తికోయల చేతిలో హత్యకు గురైన ఫారెస్ట్ రేంజర్ చలమల శ్రీనివాసరావుకు బుధవారం ఈర్లపూడిలో కన్నీటి వీడ్కోలు పలికారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు అటవీ ప్రాంతంలో ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావును గొత్తి కోయలు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలన కలిగించింది. కాగా బుధవారం రేంజర్ స్వగ్రామం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వర రావు, రాష్ట్రంలోని పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. శ్రీనివాసరావు పాడెమోసిన మంత్రులు అల్లోల, పువ్వాడ కుటుంబానికి, ప్రభుత్వ అధికారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలు**

గుత్తికోయల దాడిలో హత్యకు గురైన ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావుకు బుధవారం ఈర్లపూడి గ్రామంలో అశేష జనం కన్నీటి వీడ్కోలు పలికారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

**కన్నీటి పర్యంతమైన అటవీ అధికారులు..**

ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు దారుణ హత్యకు గురయిన విషయం తెలుసుకున్న వరంగల్ జోన్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు ఫారెస్ట్ అధికారులు వందలాదిగా హాజరై అశ్రు నయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయనతో ఉన్న అను బంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంత మయ్యారు. ఈర్లపూడి గ్రామా నికి జాతరలా తరలొచ్చిన వివిధ ప్రాంతా లకు చెందిన ప్రజలతో రహదా రులన్నీ కిక్కిరిసి పోయాయి. రాజ కీయ, సామా జిక, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలకు చెందిన అనేక మంది అంతిమ యాత్రకు తరలివచ్చారు. కాగా ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రయిలు చేసే క్రమంలో ఆయనకు గౌరవ సూచికగా పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందన సమర్పణ చేసి మౌనం పాటించారు.

**కన్నీటి సంద్రమైన 'ఈర్లపూడి గ్రామం'**

ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు మరణంతో ఈర్లపూడి గ్రామం శోకసంద్రమైంది. నిబద్ధత గల అధికారి హత్యను గ్రామస్తులు జీర్ణించుకోలే కపోయారు. శ్రీనివాసరావు ఇంటి వద్దకు గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకొని అతడి భౌతికకాయాన్ని సందర్శించి కంటతడి పెట్టారు. భర్త మరణంతో గుండెలవిసేలా రోదిస్తున్న భార్యను, తండ్రి ఇక లేదని తెలిసి తల్లడిల్లుతున్న అతడి బిడ్డలను ఓదార్చారు. శ్రీనివాసరావు అంతిమయాత్ర, దహన సంస్కారాల్లో గ్రామస్తులంతా పాల్గొన్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**పాడె మోసిన మంత్రులు..**

ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఖమ్మం వచ్చారు. ఉదయం 11 గంటలకు ఈర్లపూడి గ్రామానికి చేరుకున్నారు. శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళు లర్పించారు. అతడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు. అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు.

**ఉన్నతాధికారుల నివాళి..**

ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళులర్పించి అతడి అంతిమయాత్రలో పాల్గొన్న వారిలో హరితహారం ఓఎస్డీ ప్రియాంకా వర్గీస్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతకుమారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ఎం డోబ్రియల్, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, అనుదీప్, ఐటీడీఏ పీవో గౌతమ్ పోట్రు, భద్రాద్రి ఎస్పీ వినీత్, ఖమ్మం ఏడీసీపీ డాక్టర్ శబరీశ్, తదితరులు పాల్గొన్నారు.







# సెమినార్ ను జయప్రదం చేయండి

## పగిడికత్తుల నాగేశ్వరరావు పిలుపు



**నేలకొండపల్లి, నవంబర్ 23, కెరటం న్యూస్**

డిసెంబర్ 29, 30, 31 తేదీలలో ఖమ్మం నగరంలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 25 న మండలంలోని ముఠాపురం గ్రామంలో జరిగే మండల స్థాయి సెమినార్ ను జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు పగిడికత్తుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సెమినార్ జయప్రదం కోరుతూ బుధవారం మండలంలోని ముఠాపురం రాజేశ్వరపురం, చెన్నారం, అమ్మగూడెం, కోరుట్లగూడెం, కోనాయిగూడెం, ఆరెగూడెం గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెమినార్ లో వ్యవసాయరంగ సంక్షోభం- పరిష్కార మార్గాలు అనే అంశంపై ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి జ్యోతి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా రైతులు పండించిన పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలు లేక పెరిగిన ధరల భారంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పెట్టుబడులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యవసాయ కూలీల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగం వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిసెంబర్ 29, 30, 31 తేదీలలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సెమినార్లో రైతాంగం వ్యవసాయ కూలీలు మహిళలు అన్ని వర్గాల ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్యము సంఘం మండల అధ్యక్షుడు కేవీ రామిరెడ్డి, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు ఇంటూరి అశోక్, ఐద్వా జిల్లా నాయకులు బెల్లం లక్ష్మీ, పార్టీ మండల నాయకులు దేగల వెంకటేశ్వరరావు, ఏలూరి రంగారావు, గుగులోతు వీరు నాయక్, ఏలూరి రామారావు, మందుల లక్ష్మయ్య, చావా లెనిన్, తాళ్లూరి శ్రీను, చావా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్ఎస్ ప్రవీణ్ పుట్టిన రోజు వేడుకలు

## రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా ఇంచార్జ్ మేకతోటి పుల్లయ్య



**కల్లూరు, కెరటం న్యూస్**

బహుజన రాజ్యాధికార యాత్ర మార్గనిర్దేశకుడు, మార్గదర్శకుడు అయిన మన డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ 55వ జన్మదినాన్ని ప్రతిజ్ఞ దివస్ గా, పరాజితుల పండుగ రోజుగా.... జరుపుకుంటున్న నేపథ్యంలో.... బుధవారం కల్లూరు మెయిన్ రోడ్డు నందు గల అంబేద్కర్ విగ్రహం ముందు ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా బహుజన్ సమాజ్ పార్టీ మరియు బాంసప్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా కేకు కట్ చేసిన అనంతరం ఖమ్మం జిల్లా బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జి అయిన మేకతోటి పుల్లయ్య మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన అడిషనల్ డీజీపీ పదవికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్రంలో గల్లీ గల్లీకి బహుజన వాదాన్ని తీసుకెళ్తూ ...ఎంతోమంది సుశిక్షితులైన కార్యకర్తలను తయారు చేస్తూ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడిగా ఒక లెజెండ్ గా నిలిచారని కీర్తించారు .గురుకులాల్లో తను సెక్రటరీగా పనిచేస్తున్న క్రమంలోనే ఎంతోమంది విద్యార్థులను ఎవరెస్ట్ ఎక్కించడమే కాకుండా.... ఎంతో మంది విద్యార్థులను ఇతర దేశాలకు ..అలాగే భారత దేశంలోని ముఖ్యమైన కాలేజీలకు పంపించి తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. మరి ముఖ్యంగా... ఎంతోమంది బహుజన బిడ్డలు ఇవాళ డాక్టర్లుగా ,నేషనల్ ఐఐటి కాలేజీల్లో ఇంజనీర్లుగా గొప్పగా చదువుకుంటూ ....రాణిస్తున్నారని తెలియజేశారు .అందుకే ప్రతి ఒక్కరూ బహుజన సమాజ్ పార్టీని ఆదరించి ,ఆయన ఆశయాలను పాటించి ప్రగతి భవన్ కు ఏనుగును పంపేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ చట్టు మాల చంద్రమోహన్ ,ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ,సత్తుపల్లి మండల అధ్యక్షులు అడ్వకేట్ సుదర్శనం ,సీనియర్ నాయకులు తేళ్లూరి అర్జున్ రావు అలాగే బిఏఎంసీఈఎఫ్ సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ మడిపల్లి పూర్ణయ్య, కంచపోగు లక్ష్మణ్ మరియు ఆర్ఎస్పీ యూత్ ,చెన్నూరు వారు పాల్గొన్నారు.



# టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు పార్థీవ దేహానికి నివాళులు





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుత్తికోయల దాడిలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస రావు మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసినారు. గుత్తికోయలు అర్థం లేని ఆవేశంతో ఆయనపై దాడికి దిగి తీవ్రంగా గాయపర్చడం, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడవడం విచారకరమన్నారు. వృత్తి ధర్మం పాటిస్తూ నిబద్ధత, అంకితభావంతో పని చేస్తున్న ఒక అధికారిపై గుత్తికోయలు దాడి చేయడం శోచనీయమన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన వారిని వెంటనే గుర్తించి, అరెస్టు చేయాలని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఎన్జీవోస్ యూనియన్ మరియు ఉద్యోగ జేఏసి పక్షాన డిమాండ్ చేసారు... శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు వారు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు...వారి అంత్యక్రియలలో పాల్గొన్న వారిలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హాసన్, ఆర్ వీ ఎస్ సాగర్, నందగిరి శ్రీను, చుంచు వీరనారాయణ, నాగులమీర, భాస్కర్, సవర్జన్ పాల్, మహిళా విభాగం



జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, వై రా యూనిట్ అధ్యక్షురాలు స్వప్న, జిల్లా ఉపాధ్యక్షురాలు ఏ .జ్యోతి, మరియు జే ఏసి నాయకులు సునీల్‌రెడ్డి దొడ్డే పుల్లయ్య, కారుమంచి శ్రీనివాసరావు, భగవాన్ రెడ్డి, రంగా ప్రసాద్ ,రామకృష్ణ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి ,కస్తాల సత్యనారాయణ, ఖాజామియా, నయీమ్ పాషా, హకీమ్ ,కొదిలింగయ్య

# ఎస్.ఎఫ్.ఐ జాతీయ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**ఖమ్మం, కెరటం న్యూస్**

ఖమ్మంలోని సుందరయ్య భవన్ లో ఎస్.ఎఫ్.ఐ జాతీయ మహాసభల వాల్ పోస్టర్ ని ఆవిష్కరించటం జరిగింది... ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వర్రనపు మధు మాట్లాడుతూ ఎస్.ఎఫ్.ఐ 17 జాతీయ మహాసభలకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి 800 లకు పైగా విద్యార్థి ప్రతినిధులు హాజరవుతున్నారు. ఈ మహాసభలో నాలుగు రోజుల పాటు దేశంలోని విద్య, ఉపాధి, ఇతర రంగాల గురించి లోతైన చర్చ జరుపనున్నారు. విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు మౌలిక సదుపాయాలు, ప్రొఫెసర్ల కొరత, ప్రభుత్వ యూనివర్సిటీల పరిస్థితి, పైన భవిష్యత్తు ఉద్యమాన్ని కార్యచరణ రూపొందిస్తారు. ఈ మహాసభల సందర్భంగా విద్యార్థులతో భారీ బహిరంగ సభను ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. దీనికి ముఖ్య అతిథిగా త్రిపుర రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, హాజరవుతారు.. కావున విద్యార్థులు పెద్ద మొత్తంలో పాల్గొని విజయవంతం చేయవలసింది గా పిలిపిస్తున్నాము.. ఈ మహాసభలకు విద్యార్థులు, యువకులు, మేధావులు, ప్రొఫెసర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.. ఈ కార్యక్రమం జిల్లా సహాయ కార్యదర్శి పోనుకుల సుధాకర్, ఖమ్మం నగర కన్వీనర్ తరుణ్, ఎస్.ఎఫ్.ఐ నాయకులు అజయ్ కుమార్, నరేష్,హేమంత్, రామకృష్ణ, రఘు, లోకేష్,అక్షయ్, పాల్గొన్నారు...

# ఘనంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బర్త్‌డే వేడుకలు

## బీఎస్పీ మండల కన్వీనర్ కూరపాటి వీర్రాజు



**చర్ల, కెరటం న్యూస్**

చర్ల మండల పరిధిలోగల సత్యనారాయణపురం లో బహుజన సమాజ్ పార్టీ చర్ల మండల మహిళా కన్వీనర్ - కనితి సోని అధ్యక్షతన గవర్నమెంట్ హాస్పటల్ లో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 55వ పుట్టినరోజు సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ చర్ల మండల కన్వీనర్ - కూరపాటి వీర్రాజు బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా కూరపాటి వీర్రాజు మాట్లాడుతూ బహుజనుల ఆశ జ్యోతి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పుట్టినరోజు మారుమూల గ్రామాల్లో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు.రాబోయే బహుజన రాజ్యంలో ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం, అలాగే ఉచిత విద్య, అందుతుందని అలాగే భూములేని ప్రతి ఒక్కరికి ఎకరం భూమి అందుతుందని బాధలు లేని తెలంగాణ ఆర్ఎస్పీ నాయకత్వంలో ఉండబోతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీలందరు ఏకమై బహుజన రాజ్యానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి బిఎస్పి నాయకులు కేప గణేష్, నరసయ్య, లక్ష్మీ ,చెన్నం చంటి, పొడుతూరి రంజిత్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు...

# శ్రీనివాసరావు హత్యను ఖండించిన సిపిఎం

## సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు




**భద్రాచలం కెరటం న్యూస్**

అటవీ శాఖ చంద్రుగొండ మండలం రేంజర్ చలమల శ్రీనివాసరావు ను గొత్తె కోయలు దాడి చేసి హత్య చేయటాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు ఖండించారు. పొడుభూముల సమస్యలు పరిష్కరించుకోవటానికి ఈ మార్గం కరెక్ట్ కాదన్నారు. ఇటువంటి హత్యల వలన సమస్య పక్కదోవ పడుతుందన్నారు. పొడుభుముల సమస్యలు పరిష్కరించడం లో ప్రభుత్వం చిత్తశుద్ది తో వ్యవహరించాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న పోడు భూముల సర్వేలు, గ్రామ సభల సందర్భంగా చాలా సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వాటిని ప్రభుత్వం చిత్తశుద్ధి తో పరిష్కరించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా పోడు భూములకు పట్టాలు వస్తాయని ఎదురు చూసిన గిరిజన, మూడు తరాలుగా సాగులో ఉన్న గిరిజనేతరులు నిరాశకు గురిఅవుతున్నారని అన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించటానికి ఫారెస్ట్ అధికారులు కూడా సహకరించాలని కోరారు. ఘర్షణలు జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నరసారెడ్డి, వై వెంకట రామారావు, డి లక్ష్మి, యు జ్యోతి, రమణ, నాగరాజు, భూపెందర్, కుంజ శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెంజర్ శ్రీనివాస్ కి ఘననివాళి



**భద్రాచలం కెరటం న్యూస్**

బుధవారం టిఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి గగ్గురి బాలకృష్ణ మరియు నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్యామల శ్రీనివాస రావు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయం నందు నిన్న జరిగిన ఆటవిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన క్రీస్తు శేషులు సిహెచ్. శ్రీనివాసరావు రేంజర్ చిత్రపటానికి స్థానిక గెజిటెడ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హిరణ్ గాంధీ ద్వారా పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో నియమ నిబంధనలతో కలిగిన నీతికి నిజాయితీకి మారుపేరైన ఉద్యోగి రేంజర్ శ్రీనివాస్ రావు అని, అతని మరణం డిపార్ట్మెంట్ కే గాక యావత్ తెలంగాణ రాష్ట్రా ఉద్యోగులకి తీరని లోటని, ఇట్టి ఆటవీక దుశ్చర్యలకు పాల్పడిన వాళ్ళని తక్షణం కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వీరబాబు మరియు జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాదిక్ పాషా మాట్లాడుతూ ఒక మచ్చలేని, మకుటంలేని మనిషిక్రీస్తు శేషులు రేంజర్ శ్రీనివాస్ అని, అతని మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యోగస్తులు అందరూ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారని, భవిష్యత్తులో ఇటువంటి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, అదేవిధంగా ఉద్యోగస్తులు వెనుక మేము ఉన్నామని ప్రభుత్వం భరోసా కల్పించాలని తెలియజేశారు. తదనంతరం ఉద్యోగస్తులు మౌనం పాటించి వారి కుటుంబానికి తీవ్ర సంతాపం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ట్రెజరర్ పడిగ నరసింహారావు గాంధీ లింగమూర్తి భాస్కర్ బ్రహ్మ రావు పాపారావు శ్రీనివాస్ సీతారాములు వెంకటేశ్వర్లు వెంకటరమణ విజయ కుమారి మణెమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కవి సమ్మేళనం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**భద్రాచలం కెరటం న్యూస్**

శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ నేతృత్వంలో ఈ నెల 27 వ తేదీన పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబోయే జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆహ్వాన పత్రికను భద్రాచలం శాసన సభ్యులు పొదెం వీరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ, అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, శ్రీ శ్రీ కళావేదిక వారు నిరంతరం చేస్తున్న సాహితీ సేవలు అమోఘమని మన భద్రాచలం ఏజెన్సీ లో సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు చిట్టే లలిత, బుడగం శ్రీనివాస్, బోగాల శ్రీనివాసరెడ్డి, చింతిర్యాల రవి కుమార్, సరెళ్ల నరేష్, లాయర్ తిరుమలరావు, మరింగంటి పద్మావతి, బంధం శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



**భద్రాచలం కెరటం న్యూస్**

భద్రాచలంలో రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మోహన్ రావు ఆర్థిక సహాయంతో దుమ్ముగూడెం మండలంలోని పేషెంట్లకు మరియు భద్రాచలంలోని క్షయ వ్యాధి రోగులకు నిత్యవసర సరుకులు ( బియ్యం, కందిపప్పు, నెలకు సరిపడా గుడ్లు, మిల్క్ పౌడర్, ఆయిల్ ప్యాకెట్) ఎమ్మెల్యే పొదెం వీరయ్య , భోగాల శ్రీనివాస రెడ్డి , డాక్టర్ కాంతారావు , సమక్షంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ శ్రీనివాస్ మరియు ఎన్.టి.ఇ.పి కి స్టాప్తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన చట్టాలను అమలు చేయాలి

**భద్రాచలం కెరటం న్యూస్**

భద్రాచలం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో రత్న కల్యాణి గారికి ఆదివాసీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి భద్రాచలంలో ఉన్నటువంటి ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ గత కొన్ని రోజుల నుండి నిరుపేద ఆదివాసీలు గుడిసెలు ఏర్పాటు చేసుకొని స్థానికంగా నివాసం వుంటున్నారు.గిరిజనేతరులు దొంగ పట్టాలు సృష్టించి రెవిన్యూ భూములుఅక్రమించుకున్నారు. భద్రాచలం పట్టణంలో రెవెన్యూ భూములు గిరిజనేతరుల కబ్జా కి గురి అయిన భూములను ఉన్నత అధికారులు సమగ్ర సర్వే జరిపి ఇట్టి భూమిని అర్హులైన ఆదివాసీలకు ఇంటి స్థలాలకు కేటాయించాలని ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి అని కొరనైనది. వినతి పత్రం ద్వారా తెలియజేయడం జరిగినది ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర గోండ్వాన సంక్షేమ పరిషత్ పాయం సత్యనారాయణ, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు ఎలకం రామకృష్ణ, అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తవరపు జానకిరామ్,కిష్టా శ్రీనివాసు వాల్మీకి, ఆదివాసి సేన నాయకులు తెల్లం నరేష్, కనితి సమ్మయ్య , గనిబోయిన శీను, కాటిపోయిన శీను, తాటిబోయిన వెంకటేశ్వర్లు ,లీగల్ అడ్వైజర్ కోర్స నరేష్ ,తదితరులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం



## ఎన్నికల వాగ్దానాలు

# విస్మరించిన టీఆర్ఎస్ ప్రభుత్వం


## ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్‌జావేద్ ధ్వజం

- ◆ప్రజా వ్యతిరేక పాలన పై పోరాటాలకు సిద్ధం
- ◆రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్య గోచరం
- ◆ఎన్నికల హామీలను విస్మరించిన టీఆర్ఎస్
- ◆అమలు కానీ రైతు రుణ మాఫీ
- ◆దరణితో రైతులకు తిప్పలు
- ◆నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు
- ◆ప్రభుత్వంలో కదలిక వచ్చేంత వరకూ ఉద్యమాలు తప్పవు

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా 24న అన్ని మండల కేంద్రాలలో తహసిల్దార్ కార్యాలయం లలో వినతి పత్రాలు ఇవ్వడం ఈనెల 30వ తారీఖున అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో రెవిన్యూ డివిజనల్ ఆఫీసు ముందు నిరసన కార్యక్రమాలు డిసెంబర్ 5వ తారీఖున అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్ల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది దీనిలో భాగంగా అన్ని మండల కేంద్రాలలో రేపు ఉదయం వందలాదిగా తరలివెళ్లి తహసిల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించుటకై కాంగ్రెస్ శ్రేణులను కోరనైంది ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 లో రాష్ట్రం ఏర్పడ్డాక 2014- 2018 మధ్య ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ ఒక్కసారి కాకుండా ఆరు విడుతలలో చేయడం వలన రైతులకు వడ్డీలకు కూడా సరిపోలేదు, 2018 ఎన్నికల ఋణమాఫీ హామీ అమలు చేయలేదు. 47 లక్షల 40 వేల మంది రైతులు 24738 కోట్ల బకాయిలు అని బ్యాంకర్ల నివేదిక మాఫీ చేసింది మాత్రం 37 వేల రూపాయల వరకు 763 కోట్లు మాత్రమే. 16 లక్షల మంది రైతులు ఎలాంటి రుణం పొందకుండా బ్యాంకుల బ్లాక్ లిస్టులోకి వెళ్లారు. వారిపై వడ్డీ భారం రెట్టింపు అవుతుంది. రుణాలు చెల్లించక పోతే భూములు వేలం వేస్తాం అని బ్యాంకులు నోటీసులు పంపడంతో భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం, మహబూబాబాద్ మండలంలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

రైతులకు నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) చెల్లించడమే లేదు, 2014 లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్ర రైతులకు అనేక రకాల నష్టం జరుగుతున్నా ప్రభుత్వం పరిహారం చెల్లించడంలేదు. గ్రామాల వారీగా నష్టపోయిన రైతుల వివరాలను కూడా సేకరించడం లేదు. ఫలితంగా రైతులకు ఎప్పుడూ పంట నష్ట పరిహారం ( ఇన్ పుట్ సబ్సిడీ ) అందడం లేదు. 2020 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి వివరాలతో కేంద్రానికి లేఖ రాసింది. ఈ విషయంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర హై కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తే , అసలు పంట నష్టమే జరగలేదని కోర్టులో ప్రభుత్వం అబద్దం చెప్పింది. నిజానికి కేంద్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తు నిధి నుండి 188 కోట్లు ఖర్చు చేసుకోవడానికి 2020 నవంబర్ లోనే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. కానీ ప్రభుత్వం చెల్లింపు చేయలేదు. రైతులకు నాలుగు నెల లోపు పరిహారం చెల్లించాలని 2021 సెప్టెంబర్ 28 న రాష్ట్ర హై కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, అమలు చేయకుండా, ఒకదానికి ఒకటి పొంతన లేని మరిన్ని అబద్దాలతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ చేసింది. ప్రస్తుతం కేసు నడుస్తూ ఉంది. ఈ సంవత్సరం జులై లో కురిసిన భారీ వర్షాల వల్ల దాదాపు 20 లక్షల ఎకరాలలో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లింది . 5 లక్షల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వేలాది ఎకరాలలో భూములు కోతకు గురయ్యాయి. మరీ ముఖ్యంగా తప్పుడు డిజైన్లతో కాళేశ్వరం పేరుతో గోదావరి కి రెండు వైపులా చేపట్టిన బ్యారేజ్ ల నిర్మాణం వల్ల , బ్యాక్ వాటర్ తో మునుపెన్నడు లేని విధంగా ముంపు ఏర్పడి వేలాది ఎకరాలలో పంట నష్టం జరిగింది. ప్రాణహిత పెన్ గంగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాగుల పరీవాహక ప్రాంతాలలో, కడెం ప్రాజెక్ట్ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. స్థానిక భౌగోళిక పరిస్థితులను పట్టించుకోకుండా, నిర్మాణ విషయాలలో కనీస అవగాహన లేకుండా రాష్ట్ర వ్యాపితంగా అన్ని వాగులలో ఒకే డిజైన్ తో నిర్మించిన చెక్ డ్యాముల వలన మరింత పంట నష్టం వాటిల్లింది. అయినా పంట నష్టాల అంచనాలు కూడా ప్రభుత్వం వేయించలేదు. ఇప్పటి వరకూ రైతులను ఆదుకునే ప్రయత్నమూ చేయలేదు. కేంద్ర బృందం వచ్చి వెళ్ళినా రైతులకు నయా పైస లాభం జరగలేదు. ప్రకృతి వైపరీత్యాల నుండి రైతులను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోంది. రైతు బంధు, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్నాం అనే పేరుతో పంట నష్ట పరిహారం ఊసే ఎత్తడం లేదు. గత రెండేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో అకాల వర్షాల వల్ల,తెగుళ్లా వల్ల చేతికొచ్చిన మిర్చి పంటను రైతులు నష్టపోతే మంత్రులు గాలి మోటార్లో వచ్చి తిరిగిపోయారు తప్ప , రైతులకు పైసా సహాయం చేయలేదు. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కురిసిన భారీ వర్షాలతో నష్ట పోయిన పంటలు, మళ్ళీ సెప్టెంబర్ లో కురిసిన వర్షాలకు చేతికి రాని పరిస్థితి ఏర్పడింది. సోయా, మొక్కజొన్న పంటలలో మొక్కపైనే మొలకలు రావడంతో కొనే నాథుడు లేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటలకు రైతులకు పరిహారం అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం తన బాధ్యతను మరిచిపోతోంది. ఈ నష్టాలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. నష్టాల నుండి బయట పడే మార్గం కానరాక ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ సంవత్సరం భూమి హక్కులు, భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో, ధరణి పేరుతో ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సంస్కరణలు లాభాల కంటే రైతులకు సమస్యలనే ఎక్కువగా కొని తెచ్చాయి. రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని యేండ్ల కొద్ది రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు. అయినా 30 శాతం సమస్యలు కూడా తీరలేదు. కొందరు రైతులు విసిగి వేసారి ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. రెవెన్యూ అధికారులపై దాడులుచేసి, దహనంచేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. యేండ్ల నుంచి దున్నుకుంటున్న భూములకు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యాజమాన్య హక్కులు రావటం లేదు . వివాదాస్పద జాబితాలో ఉన్న భూములను పార్టు బి లో పడేసి పరిష్కరించకుండా మరింత జటిలంచేశారు. సాదా బైనామాల కోసం లక్షలాది మంది దరఖాస్తులు చేసుకుంటే ఇప్పటివరకు వాటిని పూర్తిగా పరిష్కరించలేదు. భూసమస్యలు పరిష్కరిస్తామని ధరణి పోర్టల్ ని అందుబాటులోకి తెచ్చి, కొత్త సమస్యలను సృష్టించారు. సాంకేతిక సమస్యలను సాకుగా చూపించి రెవెన్యూ సమస్యలను పెండింగ్ లో పెడుతున్నారు. దీనికి తోడు దాదాపు 25 లక్షల ఎకరాల పట్టా భూములను అధికారుల నిర్లక్ష్యం వల్ల నిషేధిత జాబితా లోకి నెట్టివేశారు. నిషేధిత జాబితా నుంచి తీసివేయాలనీ 90 వేలమంది దరఖాస్తులు పెట్టుకుంటే ఏ ఒక్కరి సమస్య కూడా ఇప్పటికీ పరిష్కరించిన దాఖలాలు లేవు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా, ఇతరత్రా భూ పోరాటాల ద్వారా రైతులు సాధించుకుని సాగుచేసుకుంటున్న భూములకు కూడా పట్టాలియ్యకుండా, 50-60 ఏండ్ల క్రితం భూములు వదిలేసి పోయిన భూస్వాములపేర్ల మీద రికార్డులు చూపిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు పంపిణీ చేసిన భూములకు కూడా కొత్త పట్టా పాసు పుస్తకాలు ఇవ్వడం లేదు. రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే చేపట్టాలని, వివాదాస్పద భూములను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామసభలు జరిపి భూ సమస్యలను పరిష్కరించాలని, ధరణి పోర్టల్ మాత్రమే కాకుండా, మాన్యువల్ రికార్డులను కూడా నిర్వహించే విధానాన్ని అమలులో ఉంచాలని, ప్రతి సంవత్సరం జమా బందీని అమలుచేయాలని, ప్రతి సీజన్ లో వాస్తవ సాగు దారులను కూడా నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయింది.



**పోడు భూముల సమస్య**

ఎన్నో సవత్సరలుగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వకుండా భూముల నుండి వెళ్లగొట్టుతున్నారు. అటవీ భూమి సాగు చేసుకుంటున్న రైతుల మీద అటవీ అధికారులు పోలీసులు దాడులు చేస్తూ కేసులు పెట్టుతూ జైల్లో పెట్టుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అటవీ హక్కులు కలిగి వున్నా రైతులను కూడా వదలటం లేదు 2006 అటవీ హక్కుల చట్టం అమలు చేయడం లేదు. సుమారుగా 8 లక్షల ఎకరాల వరకు అటవీ సాగు భూమి వుంటుంది. వరి పంట కొనుగులు దాన్యం కొనుగోలులో ముందస్తు ఏర్పాట్లు చేసుకోకపోవడం వలన రైతులకు ఇబ్బందులు అవుతున్నవి. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయగానే రైతుకు ట్రాక్ సిట్ ఇవ్వకపోవడం వలన రైతు వద్ద ఎలాంటి ఆదరం లేకుడా పోతుంది. ఇలా చేయడం వలన మిల్లర్లు రైతులు దోచుకొనే ప్రమాదం వుంది.ఇదివరకు కూడా మిల్లర్ల దోపిడీ జరిగింది కాబట్టి తూకం వేయగానే తూకం పట్టి రైతుకు ఇవ్వాలి. అని డిమాండ్ చేశారు.







## ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు కుటుంబానికి

# అండగా ఉంటాం

## ఎఫ్ఆర్ఓకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ తాతా మధు సూదన్

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, కెరటం న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామం ఎర్రబొడు ఘటనలో మృతి చెందిన శ్రీనివాసరావు మృతదేహాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మంత్రి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు రవిచంద్రతో కలిసి సందర్శించి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ వారి కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ తరపున, ప్రభుత్వం తరుపున మరియు జిల్లా టిఆర్ఎస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీనివాస రావు ఆత్మకు శాంతి కలగాలని మధు ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన శ్రీనివాసరావు కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఅర్ ప్రభుత్వం తరుపున రూ.50 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం ప్రకటించిందన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, రాములు నాయక్, మెచ్చ నాగేశ్వర రావు, సీఎంఓ సెక్రటరీ స్మితా సబర్వాల్, హరితాహరం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) దోబ్రియల్, పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, కలెక్టర్ వీపీ గౌతమ్, కొత్తగూడెం ఎస్పీ వినీత్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు



**వీడియోలు తీసినందుకే హత్యకు పాల్పడ్డారు...ఎస్పీ**

ప్లాంటేషన్‌లో పశువులను మేపుతున్న గొత్తికోయలను ఫారెస్టు రేంజర్ శ్రీనివాసరావు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో గొత్తికోయలు వేట కొడవళ్లతో నరికి చంపారని భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న తెలిపారు. బుధవారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చంద్రుగొండ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు హత్య కేసు నిందితులను చూపిస్తూ కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుగొండ మండలం పోకలగూడెం ఫారెస్ట్ బీటు పరిధిలో జరుగుతున్న ప్లాంటేషన్ పనులను పరిశీలించేందుకు మంగళవారం ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావు వెళ్లారు. అక్కడి నుంచి బెండాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రబోడు గొత్తికోయ గుంపునకు దగ్గరలోని ప్లాంటేషన్‌లో కొందరు పశువులను మేపుతున్నట్లు సదరు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. దీంతో ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు, ఎఫ్ఎస్వో తేజావత్ రామారావు తమ ద్విచక్రవాహనంపై సుమారు మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో అక్కడికి వెళ్లారు. అదే సమయంలో అక్కడ ఎర్రబోడు గొత్తికోయ గుంపునకు చెందిన మడకం తులా, పొడియం నంగా ఆ ప్రాంతంలో తమ పశువులను మేపుతున్నారు. ఇది గమనించిన సదరు అధికారులు మొక్కలు నాశనమవుతున్నాయని, పశువులను పక్కకు తీసుకువెళ్లి మేపుకోమని చెప్పారు. వారు వినకపోవడంతో ఆ దృశ్యాలను రేంజర్ శ్రీనివాసరావు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడం ప్రారంభించారు. దీంతో కోపోద్రేకానికి లోనైన తులా, నంగా ఎఫ్ఎస్వో రామారావుపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఆ దాడిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రేంజర్ శ్రీనివాసరావుపై గొత్తికోయలు 'మా వీడియోలు తీస్తావా' అంటూ ప్రతీకారంతో తమతో తెచ్చుకున్న వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికారు. ఆ దాడిని ప్రత్యక్షంగా చూసిన రామారావు వెంటనే అక్కడి నుంచి తప్పించుకుని పై అధికారులను సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్న ఫారెస్ట్ అధికారులు రక్తపు మడుగుల్లో కొట్టుమిట్టాడుతున్న శ్రీనివాసరావుని కారులో చంద్రుగొండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని కిమ్స్‌ని తరలించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. సెక్షన్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు చంద్రుగొండ పోలీసులు నిందితులపై 302, 353, 332 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులు తులా, నంగా పోలీసుల కన్నుగప్పి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో గల తమ స్వగ్రామానికి పారిపోతున్నట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఎర్రబోడు శివారులోని సీతారామ కాలువకట్ట వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి హత్య సమయంలో ధరించిన దుస్తులతోపాటు, దాడికి వినియోగించిన వేట కొడవళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను జుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచి కేసుని అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ గుడ్ల వెంకటేశ్వరబాబు, జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్, చంద్రుగొండ ఎస్సై విజయలక్ష్మి, పీఆర్వో దాములూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను ఆదుకోవాలి..

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ కె.వి కృష్ణారావు మాట్లాడుతూ దళిత బంధు మరియు డబల్ బెడ్ రూమ్ పథకాలు అమలు చేసే క్రమంలో తెలంగాణ ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు 20 శాతం దళిత, గిరిజన బంధు మరియు డబల్ బెడ్ రూమ్ లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దళిత బంధు, డబల్ బెడ్ రూమ్ పథకాల అమలు పక్కదారులు పడుతున్నాయని దళారుల చేతిలోకి పోయి అర్హులైన వారికి అందకుండా పోతున్నాయని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం కారుల ఫోరం దీనిని తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి 20 శాతం తెలంగా ఉద్యమకారులకు ప్రభుత్వ పథకాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ విస్మరించి తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఉద్యమకారులంతా ఏకమై ఉద్యమ కార్య చరణను చేపడతామని హెచ్చరించారు. అలాగే ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ హత్య ప్రభుత్వ లోపమని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఇటు ప్రజలను అటు అధికారులను ఉసిగొలుపుతు వారి మధ్య వైరం పెంచుతూ ఇలాంటి హత్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమని, ఇలాంటి హత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమం కారుల ఫోరం రాష్ట్ర నాయకులు పాలకుర్తి కృష్ణ, సీనియర్ ఉద్యమకారుడు గుంతేటి వీరభద్రం, తెలంగాణ ఉద్యమం కారుల ఫోరం ఖమ్మం నగర కన్వీనర్ రైస్ అన్వర్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

